విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 133 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | అక్టోబర్ 2024 | వెల : రూ 10/-





## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి
- నల్గొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు


హైదరాబాద్,
తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి, నల్గొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు నియమితులయ్యారు. బదిలీ అయిన ఐఏఎస్‌ల వివరాలను పరిశీలిస్తే.. టి.కె.శ్రీదేవి - -మిగతా 3 లో



## ఆగని బెటాలియన్ పోలీసుల నిరసన

- సచివాలయముట్టడికి యత్నం
- తమ సమస్యలను తీర్చాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు
- పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఒకే రోజు 39 మందిని సస్పెన్షన్

హైదరాబాద్,
రాష్ట్రమంతటా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలంటూ నిరసన తెలుపుతున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లను సచివాలయ ముట్టడికి యత్నించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నగరానికి వచ్చిన బెటాలియన్ కానిస్టేబుళ్లు సోమవారం ఉదయం సచివాలయం వద్దకు బయలుదేరారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ వస్తున్న వారిని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు తమ ఆవేదనను వెళ్లగక్కారు. సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ జితేందర్ తమను పిలిచి చర్చలు జరపాలని డిమాండ్ -మిగతా 3 లో



## ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది

- గుజరాత్ పర్యటనలో ప్రధాని మోడీ


వదోధర,
ప్రపంచం మొత్తం నేడు భారతదేశం వైపు చూస్తోందని, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వివిధ దేశాల నేతలు మనకు స్నేహ హస్తం అందించేందుకు ఆశగా ఎదురు చూస్తున్నాయని ఆయన చెప్పకొచ్చారు. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా లాతీ ప్రాంతంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.4,800 కోట్లతో పెద్దఎత్తున అభివృద్ధి పనులను మోదీ ప్రారంభించారు. భారతదేశంలో ఉన్న విస్తృత అవకాశాలపై ఇప్పుడు ప్రపంచ దేశాలు చర్చిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. మనం అంతర్జాతీయ వేదికలపై మాట్లాడుతుంటే పలు దేశాలు ఎంతో ఆతృతగా వింటున్నాయని చెప్పారు. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న దేశాలు మనతో చేతులు కలిపేందుకు, భాగస్వామం అయ్యేందుకు ఉవిళ్లూరుతున్నాయని ప్రధాని చెప్పకొచ్చారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాలపై ప్రతీ దేశం తమను అడుగుతున్నాయని తెలిపారు. ప్రపంచ -మిగతా 3 లో

## రాజ్ పాకాలకు రెండ్రోజుల
# సమయం ఇవ్వండి

- జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో విచారణ
- విచారణకు హాజరు కాని విజయ్ మద్దూరి
- తన ఫోన్ బదులు మరొకరి ఫోన్ ఇచ్చిన విజయ్
- కేటీఆర్ సతీమణిని విచారించిన పోలీసులు

హైదరాబాద్,
జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి కేటీఆర్ బామ్మర్ది రాజ్‌పాకాల దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణకు హాజరయ్యేందుకు -మిగతా 3 లో





## వచ్చే ఏడాది నుంచి జనాభా లెక్కలు షురు

- 2026 కొనసాగనున్న ప్రక్రియ
- చివరిసారిగా 2011లో లెక్కలు


న్యూఢిల్లీ,
దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇది 2026 వరకూ కొనసాగనున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి -మిగతా 3 లో



## సీఎం రేవంత్ ఇంటివద్ద భద్రతా మార్పులు

- బెటాలియన్ పోలీస్ సిబ్బందిని తొలగింపు
- ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
- సీఎం సెక్యూరిటీ వింగ్ కీలక నిర్ణయం

హైదరాబాద్,
జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సీఎం ఇంటివద్ద బందోబస్తు విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని సీఎం సెక్యూరిటీ వింగ్ తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో భద్రత కల్పించింది. సీఎం ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్‌పీ సిబ్బందిని -మిగతా 3 లో




## తాజ్ హెూటల్‌కు బాంబు బెదిరింపు

- పోలీసులకు సమాచారం ఇచ్చిన హెూటల్ యాజమాన్యం

న్యూఢిల్లీ,
విమానాలకు బాంబు బెదిరింపులతో ఇప్పటికే ఆందోళన నెలకొనగా, తాజాగా హెూటళ్లకు కూడా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతున్నది. ఆదివారం తిరుపతి, రాజ్‌కోట్, కోల్‌కతా, లక్నోలోని ప్రముఖ హెూటళ్లకు ఈ-మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా లక్నోలోని ఓ ఫైవ్ స్టార్ హెూటల్‌కు కూడా -మిగతా 3 లో

## రేవంత్ పాలనలో
# రోడ్డెక్కనిది ఎవరు



- 11 నెలల పాలనలో అన్నీ మోసలే
- నిరుద్యోగులకు భృతి లేదు..నియామకాలు లేవు
- ఫీజు రియంబర్స్‌మెంట్..రైతు భరోసా ఎమైంది
- ప్రభుత్వం విఫలమై ప్రతిపక్షంపై దాడి చేస్తోంది
- రేవంత్ పాలనపై హరీష్ రావు మండిపాటు

హైదరాబాద్,
రేవంత్ రెడ్డి నీ పాలనలో.. మోసం చేయనిది ఎవర్ని..? రోడ్డు మీదకు తీసుకురానిది ఎవర్ని..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అన్ని కోణాల్లో ఈ ప్రభుత్వం విఫలమై దిక్కుతోచక ప్రతిపక్షంపై దాడులు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజాపాలన తొలగిపోయి.. కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయలైందని -మిగతా 3 లో

## ఆర్మీ వాహనంపై ఉగ్రవాదుల దాడి


-ఉగ్రవాది హతం




శ్రీనగర్,

జమ్ము కశ్మీర్‌లో వరుస ఉగ్రదాడి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే కాలంలో ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఎక్కడో ఒకచోట భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడుతున్నారు. తాజాగా అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం సృష్టించింది. ఆర్మీ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. అఖ్నూర్ సెక్టార్ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆర్మీ వాహనంపై పలు రౌండ్లు కాల్పులు జరిపిన ఉగ్రవాదులు అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ఉగ్రవాదుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాదిని ఆర్మీ మట్టుబెట్టినట్లు తెలిసింది. దీపావళి సందర్భంగా జమ్ము ప్రాంతంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు జరుగుతోన్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగా, జమ్ముకశ్మీర్ అంతటా.. ముఖ్యంగా లోయలో గత వారంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు సహా కనీసం 12 మంది మరణించారు. అక్టోబర్ 24న, బారాముల్లాలోని గుల్‌మార్గ్ సమీపంలో ఉగ్రవాదులు ఆర్మీ వాహనంపై మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఇద్దరు సైనికులు, ఆర్మీలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు మరణించారు. అంతేకాకుండా గాందర్‌బల్ జిల్లాలో సోన్‌మార్గ్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఓ వైద్యుడు, ఐదుగురు వలస కార్మికులు మృతి చెందారు.

## ఈ యాప్‌తో రహస్య కెమెరాలకు చెక్



న్యూఢిల్లీ,

బెడ్రూం కార్యకలాపాలు ఇటీవల సోషల్ మీడియాకెక్కి పరువును గంగపాలు చేస్తున్నాయి. ఈ ప్రైవేటు కార్యం రహస్య కెమెరాలకు చిక్కడంతో బోల్డన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో మధురంగా ఉండాల్సిన ఏకాంత క్షణాలు చేదు గుళికలుగా మారిపోతున్నాయి. అయితే, ఇకపై ఎలాంటి బెరుకు లేకుండా, తమను ఫొటోలు, వీడియోలు తీస్తారన్న భయం లేకుండా నిశ్చింతగా ఆ మధుర క్షణాలను ఆస్వాదించవచ్చు. ఇందుకోసం జర్మన్ సెక్సువల్ హెల్త్ బ్రాండ్ 'బిల్లీ బాయ్' సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. కమ్‌డోమ్"గా పిలిచే ఈ యాప్ 'డిజిటల్ కండోమ్"గా వ్యవహరిస్తుంది. ఏకాంతంలో ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్లలోని కెమెరాలు, మైక్రోఫోన్లు పనిచేయకుండా ఈ యాప్ అడ్డుకుంటుంది. ఇకపై ఏకాంతంలో మనకు తెలియకుండా ఆ సీన్లను వీడియోలు, ఫొటోలు తీయడం, ఆడియోను రికార్డు చేయడం జరగదని బిల్లీబాయ్ పేర్కొంది. ఈ యాప్‌ను 30 దేశాల్లో విడుదల చేశారు. ఇది బ్లూటూత్ సాంకేతికతతో సమీపంలోని స్మార్ట్‌ఫోన్లను నిర్వీర్యం చేసి ఏకాంతాన్ని ఆహ్లాదంగా మారుస్తుంది. ఎవరైనా వీడియోలు, ఫొటోలు తీయాలనుకున్నా కమ్‌డోమ్ యాప్ వెంటనే రియాక్ట్ అవుతుంది. అలారం మోగి యూజర్లను అప్రమత్తం చేస్తుంది.

## భువనగిరిలో రిమాండ్ ఖైదీ పరార్ ?



యాదాద్రి భువనగిరి,

భువనగిరి సబ్ జైలు రిమాండ్ ఖైదీ భువనగిరి ప్రభుత్వ హాస్పిటల్ నుంచి పరారయ్యాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 17వ తేదీన భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫోక్సో కేసులో మహ్మద్ ఖాజా ఖాన్ అనే వ్యక్తిని జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా భువనగిరి సబ్ జైలుకు తరలించారు. 22వ తేదీన మెడికల్ చెక్ అప్ నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లిన సమయంలో పోలీసుల కళ్లు కప్పి పరారయ్యాడు. పరారైన ఖైదీ విషయం బయటకి రాకుండా జైలు సిబ్బంది జాగ్రత్తపడ్డట్లు సమాచారం. అనంతరం ఖైదీని పట్టుకొని సబ్ జైలుకు తరలించారు.

# 'గగన్‌యాన్' మిషన్‌పై ఇస్రో కీలక అప్‌డేట్

న్యూఢిల్లీ,

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక ప్రకటన చేశారు. అంతరిక్షానికి మినిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025లో కాకుండా.. ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ లెక్చర్ సందర్భంగా సోమనాథ్ ఈ కొత్త షెడ్యూల్‌ను వెల్లడించారు. చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో.. తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గనన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యం. ఆగస్టులో చంద్రయాన్-3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చీఫ్ ఇటీవలే వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది.



ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది. మరోవైపు రానున్న సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది అంటే 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

# 400కుపైగా విమానాలకు బాంబు బెదిరింపులు

-అప్రమత్తమైన జాతీయ దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ,

దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే ఏకంగా 400కుపైగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ అప్రమత్తమైంది. దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఇలాంటి ఘటనలను పరిష్కరించడానికి ఎన్ఐఏ సైబర్ విభాగం బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విశ్లేషణ ప్రారంభించింది. బెదిరింపు కాల్స్‌కు వెనుక ఉన్న ఉద్దేశాలను తెలుసుకునే పనిలో పడింది. ఇతర భద్రతా సంస్థలతో కలిసి బెదిరింపు కాల్స్‌పై విచారణ చేపడుతోంది. ప్రధాన విమానాశ్రయాల్లో బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ బృందాన్ని మోహరించింది. బెదిరింపులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించేలా ఈ బృందం శిక్షణ ఇస్తుంది. అంతేకాదు విమానాశ్రయాల్లో భద్రతా




మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తుంది. గత కొన్ని రోజులుగా ఇండిగో, ఎయిర్ ఇండియా సహా వందలాది విమానాలకు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. రోజులో కనీసం వంద విమానాలకు ఇలాంటి బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంగా విమానాలు ఆలస్యం కావడానికి తోడు.. ప్రయాణికుల్లో తీవ్ర భయాలు నెలకొంటున్నాయి. అదే సమయంలో విమానయాన సంస్థలు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి. 'విమానంలో బాంబు పెట్టాం' అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ(బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి. గత తొమ్మిది రోజుల్లో వచ్చిన బాంబు బెదిరింపులకు విమానయాన సంస్థలు దాదాపుగా 600 కోట్లకుపైగా నష్టపోయి ఉంటాయని గతంలో ఓ విమానయాన సంస్థలో పని చేసిన ఓ అధికారి తెలిపారు. సాధారణంగా ఒక డొమెస్టిక్ విమాన సర్వీసుకు అంతరాయం కలిగితే సగటున రూ. 1.5 కోట్లు నష్టం వస్తుందని, అంతర్జాతీయ విమానానికి ఇది దాదాపు రూ. 3.5 కోట్ల వరకు ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

# టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

-స్పెయిన్ ప్రధానితో రోడ్ షో

-లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ

గాంధీనగర్,

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు. కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్'




నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.


# వేణుస్వామిపై చర్యలు తీసుకోండి

-మహిళాకమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు

-స్టే ఎత్తివేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,

అక్కినేని-నాగచైతన్య శోభిత ధూళిపాళ్ల వైవాహిక జీవితం సక్రమంగా సాగదంటూ జాతకం చెప్పిన వేణుస్వామి చిక్కుల్లో పడ్డారు. నాగచైతన్య- శోభిత నిశ్చితార్థం చేసుకున్న రోజునే రంగంలోకి దిగిన వేణుస్వామి మూడేళ్లలో వీరిద్దరూ విడిపోతారని జోస్యం చెప్పారు. మరో మహిళ ప్రమేయం కారణంగా 2027లో ఈ జంట విడిపోతారని అంచనా వేసి వివాదానికి తెరలేపారు. ఈ మేరకు వీరిద్దరి



జాతకాలను వేణుస్వామి విశ్లేషణ చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. దీనిపై తెలుగు ఫిల్మ్ జర్న లిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసి యేషన్ ఆధ్వర్యంలో కొంతమంది జర్నలిస్టులు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది తెలిసిందే. అయితే కమిషన్‌కు ఆ అధికారం లేదంటూ వేణు స్వామి స్టే తెచ్చుకున్నారు. అయితే సోమవారం ఆ స్టే ఎత్తివేస్తూ మహిళా కమిషన్‌కు పూర్తి అధికారాలు ఉన్నాయని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. వారం రోజుల్లో వేణుస్వామిపై తదుపరి చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వేణు స్వామిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. గత ఆగస్టులో తెలుగు ఫిల్మ్ జర్న లిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో.. కొంతమంది జర్నలిస్టులు.. మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు.

# ఆగని బెటాలియన్ పోలీసుల నిరసన

(మొదటి తరువాయి)

చేశారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డే ఏక్ పోలీస్‌చేస్తానని వందసార్లు చెప్పాడని ఓ బెటాలియన్ కానిస్టేబుల్ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు తమను కనీసం కలవడం లేదని అన్నారు. ఒక రివ్యూ మీటింగ్ పెట్టి మా సమస్యను తీర్చే సమయం కూడా లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన చేతగాక అన్ని వ్యవస్థలను నాశనం చేస్తూ.. న్యాయం చేయాలని అడిగిన వారిని అరెస్టులు చేయించడమేనా ప్రజా పాలన అని నిలదీశారు. తమ సమస్యలను తీర్చాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు కొద్దిరోజులుగా చేస్తున్న ఆందోళనలు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే శనివారం భార్యాపిల్లలతో రోడడెక్కిన కానిస్టేబుళ్లపై తెలంగాణ పోలీసు శాఖ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్లలో ఒకే రోజు 39 మందిని సస్పెన్షన్ చేస్తూ అర్ధరాత్రి వేళ ఉత్తర్వులు ఇచ్చింది. తమ సహోద్యోగులు సస్పెన్షన్ గురికావడంతో వారికి బెటాలియన్ కానిస్టేబుళ్లంతా బాసటగా నిలిచారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని బెటాలియన్ల ముట్టడి చేపట్టారు. గంటలకొద్దీ బెటాలియన్ ముఖద్వారం వద్ద నిరసన చేపట్టినా.. కమాండెంట్ పట్టించుకోకపోవడంతో పట్టరాని కోపంతో రోడడెక్కారు. అనంతరం రాత్రి వేళ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అయినప్పటికీ సర్కారులో చలనం రాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ ప్రకారం సోమవారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. బెటాలియన్ కానిస్టేబుళ్లు సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సెక్రటేరియట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. సచివాలయం చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. పరిపాలన సౌధం చుట్టూ 163 సెక్షన్ విధించారు. సెక్రటేరియట్ పార్కింగ్ గ్రౌండ్‌లో సుమారు 200 మంది సిబ్బందిని మోహరించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసు వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కాగా, వీడియోలు తీయడానికి మీడియాకు అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు.

# వచ్చే ఏడాది నుంచి జనాభా లెక్కలు షురు

(మొదటి తరువాయి)

దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026లో ప్రభుత్వం గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్–82, ఆర్టికల్–170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. కానీ గడచిన 50 ఏండ్లుగా నియోజకవర్గాల విభజన జరగలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి ఇక చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించడం జరిగింది. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేయడం జరిగింది. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణానికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకోవడం జరిగింది. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు.

# రాజ్ పాకాలకు రెండ్రోజుల సమయం ఇవ్వండి

(మొదటి తరువాయి)

రాజ్‌పాకాలకు 2 రోజుల సమయం ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. జన్వాడ ఫామ్ కేసు విచారణలో ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుల తరఫున ఏఏజీ కోర్టుకు తెలపగా.. నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది. కాగా, తెలంగాణలో సంచలనం సృష్టించిన జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని పోలీసులు ఈ కేసులో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చారు. ఈ క్రమంలో జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని.. తనను అరెస్ట్ చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పోలీసుల ముందు హాజరయ్యేందుకు రాజ్ పాకాలకు రెండు రోజుల సమయం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, జన్వాడ్ ఫామ్ కేసులో కీలక నిందితుడైన రాజ్ పాకాల నివాసం ఓరియన్ విల్లాలో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. అనంతరం పరారీలో ఉన్న రాజ్ పాకాలకు విచారణకు హాజరు కావాలంటూ ఆయన నివాసానికి నోటీసులు అంటించి వెళ్లారు. ఈ క్రమంలోనే రాజ్ పాకాల న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇదిలావుంటే జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఫామ్ హౌస్‌లో పార్టీకి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణిని పోలీసులు విచారించారు. మరోవైపు.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న విజయ్ మద్దూరి పోలీసుల దర్యాప్తుకు సహకరించ లేదు. ఆదివారం విచారణకు హాజరైన విజయ్ మద్దూరి.. సోమవారం పోలీసుల దర్యాప్తుకు డుమ్మా కొట్టాడు. జన్వాడ ఫామ్ హౌస్‌లో రైడ్ సమయంలో తన మొబైల్ దాచిపెట్టి మరో మహిళ మొబైల్‌ను విజయ్ మద్దూరి తమకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. తన మొబైల్ దొరికితే డ్రగ్స్ లింక్స్ బయటపడతాయన్న భయంతోనే విజయ మద్దూరి వేరే మహిళ ఫోన్ అందజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడుల సమయంలో విజయ్ మద్దూరి సతీమణి ఆయన పక్కనే ఉండగా.. తన సతీమణి నెంబర్ కాకుండా థర్డ్ పర్సన్ నెంబర్‌ను ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో డబ్బులు కాకుండా కాయిన్స్ రూపంలో పేకాట ఆడినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తులో పేకాట ఆడినట్లు తేలితే మరో కేసు నమోదు చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల సమయంలో పోలీసుల కంటపడకుండా కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలా పరార్ అయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజ్ పాకాలా, విజయ మద్దూరి నోరు మెదిపితే కేసు దర్యాప్తు ముందుకు సాగుతోందంటున్నారు.

# రేవంత్ పాలనలో రోడ్డెక్కనిది ఎవరు

(మొదటి తరువాయి)

తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులను, నిరుద్యగులు, ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీకోణంలో ఆలోచించి కొనసాగించారు. కకాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచుతానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు. ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతున్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు ప్రజా పీడనగా కనబడుతుంది. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైంది. ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయింది. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోందని అన్నారు. దర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..? ఎందుకు చర్చలు జరపడం లేదు. ఎందుకు తిరగబడుతున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నవ్. ఇది సీఎం వైఖరి అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు.

ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదు. పదిహేను వేలు కాదు కదా..? ఉన్న పదివేలు కూడా రావడం లేదు. చివరకు పంటలు కొనే దిక్కు లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. రూ. 7521కు క్వింటాల్ పత్తి కొంటామని మద్దతు ధర ప్రకటించారు. కానీ రైతులు రూ. 5500కు పత్తి అమ్ముకుంటున్న పరిస్థితి. మద్దతు ధర రాకపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

(మొదటి తరువాయి)

పురపాలక శాఖ డైరెక్టర్, మంద మకరందు – సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్.కె. హనుమంతులు – పర్యాటకశాఖ డైరెక్టర్, దేవాదాయశాఖ సంచాలకులుగా జెడ్.కె. హనుమంతులకు అదనపు బాధ్యతలు, శశాంక– రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్, ఎస్.హరీశ్ – ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్, హరీశ్‌కు విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, వినయ్‌కృష్ణారెడ్డి – ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్, ఆయేషా మస్రత్ – వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, కె. చంద్రశేఖర్‌రెడ్డి – డెయిరీ కార్పొరేషన్ ఎండీ, ఎస్. దిలీప్‌కుమార్ – నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, సోని బాలదేవి – క్రీడాశాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు) కొర్రా లక్ష్మి – రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా కొర్రా లక్ష్మికి అదనపు బాధ్యతలు,ఎన్. క్షితిజ – ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ, సుభద్రా దేవి – జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్, జి.జ్ఞానేశ్వర్ – వికారాబాద్ డీఎఫ్ఓగా నియమితులయ్యారు.

## ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది

(మొదటి తరువాయి)

వేదికలపై భారత్ హవా నడుస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇటీవల భారత్ పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ తమ దేశం ప్రతి సంవత్సరం 90వేల మంది భారతీయులకు వీసాలు మంజూరు చేస్తుందని ఢిల్లీ వేదికగా ప్రకటించారని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఈ మేరకు అవకాశాలు పొందేందుకు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత దేశ యువతపై ఉందని ఆయన అన్నారు. మనం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రపంచ వేదికలపై భారతదేశం ప్రభావం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రపంచం మొత్తం భారతదేశాన్ని కొత్త కోణంలో చూస్తోందని అన్నారు. విదేశీలు ఇండియా సామర్థ్యాన్ని గుర్తించడం ప్రారంభించారని ప్రధాని చెప్పుకొచ్చారు. నేడు ప్రపంచం మొత్తం మనం చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా వింటోందని మోదీ అన్నారు. మ్రేలి జిల్లాలో 2007లో డెయిరీ కోఆపరేటివ్‌ను ప్రారంభించినప్పుడు దానికి అనుబంధంగా కేవలం 25 గ్రామాలు మాత్రమే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. నేడు ఆ సంఖ్య 700లకు చేరుకుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో అమ్రేలి జిల్లాలోని ఓడరేవులు బాగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పుకొచ్చారు. గుజరాత్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు.

## తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపు

(మొదటి తరువాయి)

ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. హజ్రత్‌గంజ్ ప్రాంతంలో ఉన్న తాజ్ హోటల్‌కు సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ ఆవరణలో బాంబు పెట్టినట్లు అందులో పేర్కొన్నారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువూ, పేలుడు పదార్థాలూ లభించలేదని తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కోల్‌కతాలోని 10 ప్రముఖ హోటళ్లకు, రాజ్‌కోట్‌లో 10 హోటళ్లకు, లక్నోలో 10 ప్రధాన హోటళ్లకు ఆదివారం ఈ–మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న మూడు హోటళ్లకు శుక్ర, శనివారాల్లో నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. హోటళ్లకే కాదు దాదాపు 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గడచిన 14 రోజుల్లో 350కిపైగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

## సీఎం రేవంత్ ఇంటివద్ద భద్రతా మార్పులు

(మొదటి తరువాయి)

మార్చి ఏఆర్ సిబ్బందిని నియమించారు. గత కొన్ని రోజులుగా బెటాలియన్ పోలీసులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ మార్పులు చేశారు. హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు నిరసనలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బెటాలియన్ పోలీసుల నిరసనలు, ధర్నాలతో హోరెత్తిస్తుండడంతో ఇంటెలిజెన్స్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీలో ఉన్నతాధికారులు కీలక మార్పులు చేశారు. ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమశిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను శనివారం నాడు పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం నాడు ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బందిని మార్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పుడు ఉన్న భద్రతా సిబ్బందిలో ఎక్కువ మంది గత సీఎం కేసీఆర్ వద్ద పని చేసిన వారే. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం, ఆయనకు సంబంధించిన వ్యక్తిగత, అధికారిక సమాచారం బయటకు వెళ్తోందని మార్పులు చేశారు. పాత వారిని తొలగిస్తూ కొత్త భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే సమాచారం బయటకు వెళ్లడంపై సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అప్పుడు భారీగా మార్పులు చేశారు. అలాగే ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసుల నిరసనల నేపథ్యంలో ఉన్నతాధికారులు ముందుగానే అప్రమత్తం అయ్యారు.

## సంపాదకీయం

# డిజిటల్ అరెస్టులు పారాహుషార్..!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్ట్ల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో డజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్లైన్ కుంభకోణమని సీఈఆర్టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్లైన్లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్కీబాత్లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్లు, ఇన్వెస్ట్మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు.వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్షాట్ తీసి, కాల్ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్ద. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

# మంచి పఠనానుభవం కథ 2023

ఏది మంచి కథ అనే దానికి అనేక కొలమానాలు వుంటాయి. సమకాలీనంగా మానవ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలు కథా రూపం తీసుకోవడం వల్ల ఆయా కాలాల్లో జరిగిన సంఘటనలు కళాత్మకంగా నమోదవుతాయి. అనేక ఇతర రూపాలు వున్నా కూడా కథలో ఆ ఘటనలు విపులంగా చర్చించే అవకాశం వుంటుంది. నవలలో ఇంకా ఎక్కువ పార్శ్వాలు సశించే అవకాశం వుంటుంది. ఒక సంవత్సరంలో వచ్చే వేలాది కథలలో కొన్ని పరిమితుల మేరకు కథలు ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడు- కొన్ని కథలు వస్తువు రీత్యా, కొన్ని శిల్పం రీత్యా, కొన్ని వస్తుశిల్పాల రీత్యా, కొన్ని అభివ్యక్తి నవ్యత మీద ఆధారపడి ఎన్నికవుతాయి. హృదయాలను కదిలించే, మేధకు మేత పెట్టే కథలు చరిత్రలో నిలబడి వుంటాయి కనుక అటువంటి కథలు ఎంపిక చేయ డానికి ప్రాధాన్యం వుంటుంది. గత 34 సంవత్సరాలుగా ఈ పనిని నిరాటంకంగా చేస్తున్న కథా సాహితి ఆనవాయితీగా ఈ సంవత్సరం కూడా 15 కథలతో కథ - 2023 తీసుకువచ్చింది. మొదటి కథ కుప్పిలి పద్మ 'మెట్రో కావల' కథ పల్లెటూరుల నుంచి నగరానికి వలస వచ్చే పేద/ మధ్య తరగతి ప్రజల జీవన సర్దుబాటుల గురించి రాసినది. ఇందులో రచయిత్రి "తల్లి ప్రేమనే మింగేసే యీ ఎదుగుదల నిజంగా ఎదుగుదలేనా?" అని పేదవాళ్ళు తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకునే సందర్భంలో అనగలిగి నప్పుడు- సామాజికంగా, ఆర్థిక వెసులుబాటు వున్నవాళ్ళు కూడా విదేశాలకు వలస వెళ్ళినప్పుడు, వాళ్ళు కూడా తల్లిదండ్రులని వదిలేసే వెళుతున్నారు. ఒక్కోసారి అంత్య క్రియలు కూడా హాజరుకాలేక వీడియోలతో సరిపుచ్చుతున్నారు. ఆదాయం పెంచుకుందాం అనుకోవడం తప్పు కానప్పుడు, అది దేనిని వదులుకోవాల్సి వస్తే సమకూరుతుందో కూడా పరిగణన లోకి వస్తుంది కదా! డే కేర్ సెంటర్లు, కుక్కల కెఫేలు భరించే పరిస్థితి మధ్య తరగతి వారికి కూడా వుండదు. కొన్ని సర్దుబాట్లు తప్పనిసరి. మంగ అలాంటి సర్దుబాటు చేసుకోవడానికి సిద్ధమయింది. అటు వున్న ఊరిలో సుఖం వదులుకోలేక, ఇటు నగరంలో అయినోళ్ళు కనపడక, వచ్చే ఆదాయం వదులుకోలేక మధ్యతరగతి నలుగుబాటుని ఈ కథ పట్టుకుంది. మనం చూడని కోణం చూపెట్టింది. కత్తి పద్మ 'పులస' మంచి కథ. ఆడదానికి 'బూవి'




వుండాలని పోరాడే రవణమ్మ కథ. సమాజానికి విరుద్ధంగా తన ఆత్మగౌరవం కోసం పోరాడే ప్రతి స్త్రీ ఏటికి ఎదురీదే 'పులస' లాంటిదేనని రచయిత్రి అభిప్రాయం నిజమే అనిపిస్తుంది. ఎదురీదే కొద్దీ రుచి (విలువ) పెరిగే పులస లాగే పోరాడే కొద్దీ ఒక స్త్రీ వ్యక్తిత్వం (విలువ) పెరుగుతుందని ఈ కథ సారాంశం. ఆస్తి హక్కు స్త్రీ ప్రాథమిక హక్కు అనడం వల్ల ఇంకా ప్రజాస్వామ్యీకరించబడని మన పురుష సమాజాల్లో ఎంత దుమారం రేపుతుందో చెప్పిన కథ. ఉత్తరాంధ్ర ప్రాంత మాండలికం కథకు జీవం ఇచ్చింది. కథ నిడివిని కథ నాణ్యత తగ్గకుండా తగ్గించవచ్చు అనిపించింది. బెజ్జారపు రవీందర్ కథ 'సుశీత' లేవనెత్తిన అంశం మంచిదయినా నిర్వహించిన విధానం వల్ల కథలో చర్చించాల్సిన అంశం అంత లోతుగా చర్చకు రాలేదు. టీనేజి దాటని యువతీ యువకులు ముఖ్యంగా యువతుల లైంగికతకు సమాజ మద్దతు వుండదు. ఒకవేళ వారు హద్దు దాటి ప్రవర్తిస్తే దానికి బాధ్యత ఎవరిది? పెరిగిన సాంకేతికత, భ్రమాన్విత జీవితాలు, ఆకర్షణా వలల వలయాల్లో చిక్కుకునే యవ్వన ప్రలోభాల మధ్య చిందరవందర అవుతున్న జీవితాలకి పరిష్కారం ఏమిటి? అని చర్చించాల్సిన కథ సుశీత%ా% అరవింద స్నేహమూ, సంసార వివరాల్లోకి మిస్ఫైర్ అయింది. శంకరి లాంటి తెలిసీ తెలియని వయసు యువత ఏ రకంగా ఇలా తప్పుజారి పోతున్నారో చెప్పాల్సి కథ దారి మళ్ళింది. కథలో అంతస్సారమైన ఈ విషయం అతి తక్కువగా ప్రస్తావనకు వచ్చింది. "జీవితంలో పైకి వచ్చిన స్త్రీలు మిగతా స్త్రీలకు సపోర్ట్ చేసుకుంటూ తోచినంతగా ఆడవాళ్ళ సమస్య మీద పని చేస్తే ఈ ప్రపంచంలో సగం దు:ఖం మాయమౌతుందని" అనుకునే మాట మనం మనలోని అసంతృప్తులని అణచివేయడానికి అనుకునే మాట. ఆ మాట అరవింద అంటే అది నిజమేగా అని సుశీత తనకు చేతనయినంతగా అసహాయులకు పని చేయడం వరకు ఓక్టె గానీ.. "స్త్రీత్వాన్ని స్వీకరించగల అర్హుడైన పురుషుడే లేడు ఈ లోకంలో" అనడం.. అదీ ఒక బాధిత స్త్రీ శంకరితో సుశీత అనడం అతిశయోక్తిగా వుంది. ఎందుకంటే అప్పటికే శరీరాన్ని అనర్హుడికి అర్పించిన యువతి ఈ మాటలతో మరింత కృంగిపోదా? దీనికి ఉదాహరణగా ప్రణరు అమృతల ప్రేమకథ చూడవచ్చు. ఇక్కడ అమృత తను ప్రేమించినవాడిని వివాహ మాడినా, తన భర్తను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నా, ఇంకా అమృతను శూలాల్లాంటి మాటలతో వేటాడుతున్న సమాజాన్ని చూడవచ్చు. చాలా విషయాల్లో మన సమాజం ఇంకా ఆధునిక భావనలను సంతరించుకోలేదు. పాణిని జన్నాభట్ల 'చేయాల్సిన పని' కథ ఒక అసహాయుడి ఆక్రోశాన్ని భిన్నంగా చెప్పడానికి ప్రయత్నించింది. ఆధునికత జీవితాలను నిస్సారంగా మార్చే వ్యవస్థను తప్పించుకోలేక, తనని తాను సర్దుకోలేక సతమతమై, కాసింత ప్రేమ కోసం తపిస్తూ, తనలో తాను చీకటిలో మునిగిపోయి, తేలలేక, తన చుట్టూ వున్నవారిని కూడా ఆ చీకటిలో ముంచేయడానికి ప్రయత్నించి, విఫలమయి, మరలా ఒక ఆశ కనిపించి, జీవితం మీద ఒక వెలుగు కనిపించి, తనని కూడదీసుకొన్న ఒక వ్యక్తి కథ ఇది. కథ నిర్వహించిన విధానం ఈ కథకు ఆయువుపట్టు. పాణిని కథల వైపు మనం ఆశగా చూడొచ్చని ఈ కథ మనకు ఆశ పెడుతుంది. అఫ్సర్ కథా వస్తువులు భిన్నమైనవి. క్లిష్టమైనవి. మన అనుభవంలో లేని విషయాలని మనకు అనుభవం అయ్యేలా చేస్తాయి. 'రకూన్' అటువంటి కథ. మన మనసులో తిష్ట వేసుకున్న, మనకే తెలియని అస్పష్ట విద్వేషం మన కళ్ళ ముందు వున్నట్టుగా అనుకోవడం.. ఆందోళన చెందడం కథా వస్తువు. ఈ అమూర్త వివక్షా రూపానికి కనిపించే/ కనిపించని రూపం రకూన్. ఎట్లయితే లేని ద్వేషం మన మనసులో వున్నట్లుగా భయపడుతున్నామో.. అట్లనే లేని రకూన్ కూడా వున్నట్లు భ్రమసి భయపడుతుంటాడు ఈ కథలో పేరు లేని ప్రధాన పాత్రధారి. అయితే ఈ కథ చెప్పే ్ అవ ఈ కథకు ప్రత్యేకమైనది.

# మోడీ 'మంత్రోపాసన'

ఇన్నాళ్లూ డిజిటల్ ఇండియా అంటూ జపం చేసిన ఇదే ప్రధాని నేడు 'మన్కీ బాత్'లో డిజిటల్ మోసాల గురించి మాట్లాడటం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రధానమంత్రి చాప కింద నీరులా సమాజాన్ని కబళిస్తున్న ప్రమాదాన్ని గుర్తించడం సంతోషమే. అయినా, వాటిని అరికట్టడానికి తమ సర్కార్ ప్రణాళికలను గురించి మాత్రం ఆయన ప్రస్తావించలేదు. కేవలం కంటి తుడుపు చర్యగా రాష్ట్రాల సహకారంతో దర్యాప్తు సంస్థలు ఈ బెడద నిర్మూలనకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. 'క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి'.. అనే మంత్రోపదేశమొకటి చేశారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్లైన్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఎంతో పురోగతిని చూస్తున్నాం. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్ల వ్యూహాలూ మారిపోతున్నాయి. రోజుకో కొత్త విధానంతో మోసాలకు తెగబడుతున్నారు. పెరిగిపోతున్న ఈ డిజిటల్ మోసాలపై స్వయంగా ప్రధానమంత్రే ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్కీ బాత్'లో సైబర్ నేరాల తీవ్రత గురించి ప్రస్తావించారు. వాటిపై ఆందోళన వద్దని, అప్రమత్తతతో ఉంటే చాలని ముక్తాయించారు. అదే సందర్భంలో ప్రధానిగా తమ ప్రభుత్వం ఇలాంటి నేరాల కట్టడికి ఎలాంటి చట్టాలు చేయనుందో ఆయన చెప్పలేదు. నేడు దాదాపు అన్నిరకాల విక్రయ కేంద్రాల్లో, మారుమూల పల్లెల్లో సైతం క్యూఆర్ స్కానర్లు దర్శనమిస్తున్నాయి. సరికొత్తగా భారత్, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థారులాండ్ల శీఘ్రతర చెల్లింపు వ్యవస్థల అనుసంధాన ప్రతిపాదనను ఆర్బీఐ వెల్లడించింది. ఇదంతా నాణానికి ఒకవైపు. రెండో పార్శ్వం ఆందోళనకర స్థితిగతుల్ని కళ్లకు కడుతోంది. కేంద్రహోం మంత్రిత్వశాఖ, ఆర్బీఐ లెక్కప్రకారం, గత ఐదేండ్లలలో నమోదైన దగాకోరు బాగోతాలు ఎకాయెకీ 5లక్షల పైనే. దేశంలో సగటున రోజుకు ఆరువేలకుపైగా సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందుతున్నాయంటున్న ఐ4సీ (ఇండియన్ సైబర్క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 7.4లక్షల కేసులు



నమోదైనట్టు ధ్రువీకరిస్తోంది. దేశంలో చోటుచేసు కొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్లు, ఇన్వెస్ట్మెంట్ మోసాల్లో దాదాపు 46 శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ నాలుగు నెలల్లోనే సైబర్ నేరగాళ్లు రూ.1770కోట్ల దాకా కొల్లగొట్టారు. షేర్ ట్రేడింగ్లో విపరీత లాభాలొస్తాయంటూ 23 రాష్ట్రాల్లో 168మందికి రూ.22కోట్లకుపైగా టోపీ పెట్టిన గాజియాబాద్ గ్యాంగ్ చేతివాటం తాజాగా బట్టబయలైంది. జార?ండ్, రాజస్థాన్, హర్యానా, యూపీలలో తిష్టవేసిన సైబర్ ముఠాలే 80శాతం నేరాలకు పాల్పడుతున్నట్టు ఐఐటీ కాన్పూర్ అధ్యయనం ఇటీవలే నిగ్గుతేల్చింది. రోజూ వేలల్లో ఫిర్యాదులు వస్తున్నా విచారణరేటు స్వల్పంగానే ఉందన్న జాతీయ సైబర్ భద్రతా సమన్వయకర్త, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ రాజేశ్ పంత్ వ్యాఖ్యలు సైబర్ ముష్కరుల కట్టడిలో వ్యవస్థాగత వైఫల్యాన్నే ఎత్తిచూపుతున్నాయి. దేశంలో వచ్చే ఏడాదికి అంతర్జాల వినియోగదారులు 90కోట్లకు చేరనుండగా ఇప్పటికే మొబైల్ కనెక్షన్ల సంఖ్య 116కోట్లకు పైబడింది. వినియోగ విస్ఫోటానికి దీటుగా ప్రభుత్వం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకవపోవడంతో తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వాటిల్లో పొరుగునున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని కేంద్ర హెూం మంత్రిత్వశాఖే వెల్లడించింది. డిజిటల్ భద్రత బీటలు వారకుండా ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలో, ఆన్లైన్ మోసానికి గురైతే తక్షణం ఎవరిని ఎలా ఆశ్రయించాలో పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

నేరగాళ్లు ఎక్కడున్నా సాంకేతిక నిఘా, ఉమ్మడి కార్యాచరణతో ఆన్లైన్ నేరగాళ్లకు ఉచ్చు బిగించడం ఎలాగన్న దానిపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి. ఇటీవల 61 దేశాలకు చెందిన పోలీస్ దళాలు 'ఆపరేషన్ ఫస్ట్ లైట్ 2024' పేరిట చేపట్టిన ఏకోన్ముఖ దాడిలో నాలుగు వేలమంది వరకు మోసగాళ్లు పట్టుబడ్డారు. ఆస్ట్రేలియా, జింబాబ్వే వంటి దేశాలు సైబర్ భద్రతకై ప్రత్యేక మంత్రిత్వశాఖనే ఏర్పాటుచేశాయి. ఆయా దేశాల అనుభవాల నుంచి సైబరాసురుల పీచమణచే వ్యూహాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదునుపెట్టాలి. సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వాలు కలిసికట్టుగా ఉక్కుపాదం మోపితేనే, దేశంలో డిజిటల్ చెల్లింపులు సురక్షితమవుతాయి. అంతే కానీ, ప్రధాని చెప్పినట్టు 'ఆగి ఆ తర్వాత నిర్ణయించండి..' అనే "మంత్రోపాసన" వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.

అక్టోబర్ 2024

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

## ఘనంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు





**కూకట్ పల్లి అక్టోబర్ 28 ప్రజా స్వేచ్ఛ**

రెవిన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల్లో కూకట్ పల్లి యువ నాయకులు గాదె శివ చౌదరి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని శాలువాతో సన్మానించి, పులబోకే ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు. తర్వాత ఇరిగేషన్ కార్పొరేషన్ ఆఫీస్ నందు ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేయడం జరిగింది. మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ తో కలిసి వారిపై రాసిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో యువ నాయకులు శివ చౌదరి. పాల్గొన్నారు. వారితో పాటు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు.

## షాపూర్ నగర్ లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన

**-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ**

షాపూర్ నగర్ అడ్డమీది కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా, బిపి, షుగర్, కిడ్నీ, లివర్, లాంటి పదహారు రకాల చికిత్స పరీక్షలు చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రవిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడుకి హెల్త్ కార్డ్స్ చేయించడం జరిగింది. అలాగే ఆరు నెలలకు ఒకసారి చెక్ చేయించుకోవాలని ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని బీపీ, షుగర్, ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ప్రతి ఒక్క కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలని ఉచిత వైద్య శిబిరం కార్యక్రమం పెట్టడం జరిగిందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, జాయింట్ సెక్రెటరీలు, కోశాధికారులు, ఆర్గనైజర్స్, అడ్వైజర్స్, కమిటీ సభ్యులు, మహిళలు, వృద్ధురాలు, వితంతువులు, వికలాంగులు, అదేవిధంగా అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొనడం జరిగిందని అలాగే నిత్యం కార్మికులతోనే ఉంటూ భవన నిర్మాణ కార్మికులు ఏలాంటి అనారోగ్యానికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉండాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్న లేబర్ ఆఫీస్ డాక్టర్లకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన పేలపూడి చౌదరి బ్రదర్స్



**మోత్కూరు అక్టోబర్ 28 ప్రజా స్వేచ్ఛ**

మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన వళ్ళందాసు యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మృతుని దశ దిన కర్మ సందర్భంగా పేలపూడి చౌదరి బ్రదర్స్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం గా దశ దిన కార్యక్రమానికి 50 కిలోల బియ్యం, నూనె, తదితర వంట సామగ్రి ని పేలపూడి చౌదరి బ్రదర్స్, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ పేలపూడి మధు లు అందజేశారు.మృతుడు వల్లందాస్ యాదయ్య కుమారుడు నరేష్ కు అతని క్లాస్ మేట్స్ పొడిచేడు పాఠశాల 1997 బ్యాచ్ కి చెందిన తోటి మిత్రులు అందరూ కలిసి 19 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వళ్ళందసు వెంకటేష్,సురేష్, పర్వతం షణ్ముఖ చారి,బండ చిన లింగయ్య, దేందే మల్లేష్, యాదగిరి,జిట్ట బుచ్చయ్య, వీరాస్వామి ,శ్రీను, ఎర్రబాబు, మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీసు శాఖలో మరో సంచలనం.. 10 మందిని ఏకంగా సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.


**ప్రజా స్వేచ్ఛ**


లేవనెత్తిన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని రోడ్డు ఎక్కిన 39 మంది తెలంగాణ స్పెషల్ పోలీస్ (TGSP) సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, రాష్ట్ర డీజీపీ (DGP) హెచ్చరించినా ఆయా బెటాలియన్ల పరిధిలో పోలీసుల ఆందోళనలు ఆగడం లేదు. ఈ క్రమంలోనే తాజాగా.. మరో 10 మంది బెటాలియన్ పోలీసులను (Battalion Police ) ఏకంగా సర్వీస్ నుంచి తొలగిస్తూ తెలంగాణ పోలీసు శాఖ (Telangana Police Department) సంచలన నిర్ణయం తీసుకుంది. సర్వీస్ నుంచి తొలగించబడిన వారిలో 17వ బెటాలియన్ (సిరిసిల్ల)కు చెందిన ఆరుగురు కానిస్టేబుళ్లు, 12వ బెటాలియన్ (అన్నెపర్తి)కి చెందిన ఇద్దరు కానిస్టేబుళు,, 6వ బెటాలియన్ (కొత్తగూడెం)కు చెందిన ఒకరు ఉన్నారు. ఈ మేరకు ఏడీజీ సంజయ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు వృత్తిలో ఉండి ధర్నాలు, ఆందోళనలకు నాయకత్వం వహించారని.. నిరసనలను ప్రేరేపించి క్రమశిక్షణను ఉల్లంఘించారని అందుకే TGSP సిబ్బందిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజ్యాంగం ( Constitution )లోని ఆర్టికల్ 311 (Article 311) ప్రకారం.. మొత్తం 10 మంది సిబ్బందిని సర్వీస్ నుంచి తొలగిస్తూ చర్యలు తీసుకున్నారు. కాగా, తెలంగాణ స్పెషల్ పోలీస్ ( Telangana Special Police) క్రమశిక్షణను పటిష్టం చేయడానికి ప్రధాన విలువలను నిలబెట్టడానికి, రాష్ట్రం అంతటా అంతటా బహిరంగ ప్రదేశాల్లో అనధికారిక ఆందోళనలు, సమ్మెల్లో పాల్గొన్నందున కొంతమంది సిబ్బందిని సర్వీస్ నుంచి తొలగిస్తున్నామని పోలీసు శాఖ (Police Department ) ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది.


# ప్రకృతి వైపరీత్యాల పై అవగాహన అవసరం

**1971 అక్టోబర్ 29... విషాదం మిగిల్చిన ఒడిషా తుఫాను సంఘటన**

**రామ కిష్టయ్య సంగన భట్ల...**







1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకులం చేసిన తుఫాను, ప్రకృతి ప్రతాపానికి నిదర్శనంగా మిగిలింది. ఈ తుఫాను అత్యంత శక్తిమంతమైనదిగా పరిగణించ బడుతుంది. అధిక వేగంతో వీచిన గాలులు, భారీ వర్షాలు, తీరప్రాంతాల్లో భారీ అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వేల మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వ్యవసాయ భూములు, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీరప్రాంత వృక్షసంపద, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, పునర్నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. ఆర్థిక నష్టం అంచనాకు అందనిది. 1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకుతలం చేసిన తుఫాను భారత దేశంలో ప్రకృతి వైపరీత్యాల ప్రతాపాన్ని చాటిచెప్పింది. ఈ తీవ్ర తుఫాను వల్ల ఊహాతీత విధ్వంసం జరిగిందిబీ తుఫాను ఉప్పెన ఒడిశా తీరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది, 10,000 మందికి పైగా మరణించారు. 50,000 పశువులు చని పోయాయి. వందల వేల చెట్లు నేలకూలాయి. తుఫాను 800,000 కంటే ఎక్కువ ఇళ్లను ధ్వంసం చేసింది. రోజుల తరబడి కమ్యూనికేషన్లు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విపత్తు వార్త బయటి ప్రపంచానికి అందకుండా చేశారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ తుఫానుతో భారీ వర్షాలు, 300 కి.మీ.ల వేగంతో వీచిన గాలులు, తీరప్రాంతాల్లో అతిపెద్ద అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వ్యవసాయ భూములు, ఇళ్ళు, తీరప్రాంతంలో ఉన్న వృక్ష సంపద, జీవవైవిధ్యం తీవ్రంగా నష్టపోయాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ ఈ తుఫాను ప్రభావం నుంచి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పట్టింది. ఈ సంఘటన అనంతరం, విపత్తుల నిర్వహణలో ముందస్తు చర్యలు, అవగాహన, పునర్నిర్మాణ ప్రణాళికలు ఎప్పటికప్పుడు ముమ్ముందుకు రావాల్సిన అవసరం స్పష్టమైంది.ప్రకృతి వైపరీత్యాలు అంటే ప్రకృతి సృష్టించే భారీ సంఘటనలు, ఇవి పర్యావరణాన్ని, జీవ సారాన్ని, ప్రజల ఆస్తి, ప్రాణాల్ని ప్రభావితం చేస్తాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, కరువు, అగ్నిపర్వతాలు వంటి విపత్తులు మనకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కాకుండా మానవ చర్యల వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. ఉగ్రవాదం, యుద్ధాలు, అణు బాంబులు, పరిశ్రమల కాలుష్యం వంటి మానవ నిర్మిత విపత్తులు మన భద్రత, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో పాటు, పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తాయి.భారతదేశంలో ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్ ప్రకారం గత మూడున్నర దశాబ్దాల్లో భారత్‌లో దాదాపు 431 రకాల ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఈ విపత్తుల వల్ల 1,43,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావానికి గురయ్యారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఈ విపత్తుల కారణంగా భారతదేశ జాతీయ ఆదాయంలో ఏటా సుమారు 2.25 శాతం నష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 20 సంవత్సరాల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు భారతదేశంలో సుమారు 7,950 కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగించాయి.ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు సన్నాహాలు మరియు విపత్తు నిర్వహణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. సహాయ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజలలో అవగాహన పెంపొందించాలి. విపత్తుల నిర్వహణ కోసం పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి ముందడుగు వేయాలి. విపత్తులకు ముందుగానే పునరుద్ధరణ ప్రణాళికలు తయారు చేయడం, ప్రజలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం.ప్రపంచవ్యాప్తంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు ప్రకృతి పరిరక్షణకు అనేక విభాగాలను అమలు చేస్తుంది. 1991లో భారత ప్రభుత్వం ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఈ నిబంధనలు తీరప్రాంతాలలో నిర్మాణం, పరిశ్రమలు వంటి కార్యక్రమాలకు నిరోధం కల్పిస్తాయి. కానీ, అభివృద్ధి పనుల పేరుతో మడ అడవులు, హరిత వనాలు వంటి ప్రకృతి వనరులను విచ్ఛిన్నం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిర్దిష్ట బడ్జెట్ కేటాయించి, నష్టం అంచనాలలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రకృతి వనరులను కాపాడవచ్చు.ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు విపత్తు నిర్వహణపై దృష్టి సారించాలి. తీరప్రాంతాలలోని మడ అడవులు, చిత్తడి నేలలు, హరిత వనాలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల నివారణకు తగిన నిధులను సమకూర్చడం, గ్రీన్ కవర్ ను పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం వంటి చర్యలు అత్యవసరం.

# పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సి ఎస్ శాంతి కుమారి





**శేరిలింగంపల్లి అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ**

పి ఎస్ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, స్పెషల్ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు పలు ఇతర స్పెషల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు 28.10.2024న అసెంబ్లీ భవనాల కమిటీ హాల్ నెం.1లో. సమావేశంలో సభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాసరెడ్డి, రామరావు పవార్, కూనంనేని సాంబశివరావు భాను ప్రసాదరావు అకౌంటెంట్ జనరల్ శ్రీమతి పి. మాధవి అసెంబ్లీ లేజిస్లేచర్ శ్రీ డాక్టర్.వి నర్సింహా చార్యులు ఇతర అధికారులు హాజరైనారు. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి కొత్తగా ఎన్నికైన చైర్మన్ & సభ్యులు మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమను తాము పరిచయం చేసుకున్నారు. యునైటెడ్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కొన్ని పారాలతో పాటు 549 ఆడిట్ పారాస్ మరియు 41 సిఫార్సులపై చర్చను పిఏసి చేపట్టాల్సి ఉందని చైర్మన్ ఆరెకపూడి గాంధీ తన ప్రసంగంలో వెల్లడించారు. అవసరమైన సూచనలను అందించడం ద్వారా అవసరమైన నివేదికలను త్వరితగతిన సమర్పించేలా చూడాలని దానిపై సమర్ధవంతమైన చర్చను చేపట్టడానికి కమిటీకి సహకరించాలని ఆయన ప్రధాన కార్యదర్శి మరియు ఇతర సీనియర్ అధికారులను కోరారు. అనుభవజ్ఞులైన సభ్యులు, అకౌంటెంట్ జనరల్, ప్రభుత్వ సీనియర్ అధికారుల సహకారం మరియు మార్గదర్శకత్వంతో కమిటీ సమర్ధవంతంగా పని చేయగలదని తన నివేదికను సమయానికి సమర్పించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అకౌంటెంట్ జనరల్ పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పారాస్, మునుపటి పి ఎ సి ఎస్ సిఫార్సులపై తీసుకున్న చర్యలపై వైఖరిని స్పష్టం చేశారు. సెప్టెంబరు, 2024లో ఏర్పాటైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి ఇది రెండవ సమావేశం. శాసనపరిషత్తు చైర్మన్ శాసనసభ సభాపతి అధ్యక్షతన సెప్టెంబరు 21, 2024న మేము కమిటీ యొక్క మొదటి సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. కాగ్ నివేదికలలో ఉన్న ఆడిట్ పేరాల పెండెన్సీ గురించి కమిటీ యొక్క మునుపటి నివేదికలలో చేసిన సిఫారసులపై తీసుకున్న చర్యల గురించి చర్చించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు మరియు కార్యదర్శులతో ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. రాష్ట్ర శాసన మండలికి సీఏజీ నివేదికలు సమర్పించడం, ఈ నివేదికలను పి.ఏ.సి. పరిశీలించడం సీఏజీ గమనించిన అంశాలపై వివరణ ఇవ్వడంలో సంబంధిత శాఖల ప్రతిస్పందన.. వంటి మూడు ముఖ్యమైన అంశాల గురించి నేను ప్రస్తావించదలచుకున్నాను. మీ అందరికీ తెలిసినట్లుగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 151(2) ప్రకారం రాష్ట్రాలకు సంబంధించిన సీఏజీ నివేదికలు ప్రతి సంవత్సరం రాష్ట్ర శాసనసభ ముందు ఉంచబడతాయి. ఈ నివేదికలు ఫైనాన్స్ అకౌంట్స్, అప్రాప్రియేషన్ అకౌంట్స్, జనరల్ అండ్ సోషల్ సెక్టార్, రెవిన్యూ సెక్టార్, ఎకనామిక్ సెక్టార్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, లోకల్ బాడీస్ మరియు స్టేట్ ఫైనాన్స్



ఆడిట్లకు సంబంధించినవి. సీఏజీ నివేదికలలో ఫైనాన్షియల్ ఆడిట్, పెర్ఫార్మెన్స్ ఆడిట్ మరియు కాంప్లయన్స్ ఆడిట్లకు సంబంధించిన అంశాలు పొందుపరచబడి ఉంటాయి. 2021-22 మరియు 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అకౌంట్స్‌తోపాటు, రాష్ట్ర ఆర్థిక, రెవిన్యూ రంగాలపై కాగ్ నివేదికలు 2024 ఆగస్టు 2న బడ్జెట్ సమావేశంలో శాసనసభకు సమర్పించడం జరిగింది. కాగ్ నివేదికల్లో ఉన్న ఆడిట్ పేరాలకు సంబంధిత విభాగాలు సమర్పించిన వివరణాత్మక నోట్సు, కమిటీ యొక్క మునుపటి వార్షిక నివేదికలలో ఉన్న సిఫారసులపై తీసుకున్న చర్యా నివేదికలను పరిశీలించడంతోపాటు కాగ్ రిపోర్టును పరిశీలనకు చేపట్టడంలో కమిటీ పనిని సులభతరం చేయడానికి ఈ పిఏసి సమావేశాలు దోహదపడతాయి. పి.ఏ.సి. తరచుగా సమావేశమై ఆర్థిక ఆడిట్లపై మాత్రమే కాకుండా, ప్రభుత్వ శాఖల ఆర్థిక పనితీరు మరియు కంప్లయన్స్ ఆడిట్లపై కూడా తన దృష్టిని సారించి, దాని పరిశీలన ఫలితాలు రాష్ట్ర శాసనసభకు కమిటీ యొక్క నివేదికగా సమర్పించేలా చూసుకోవలసిన బాధ్యత కమిటీకి ఉంది. పెండింగులో ఉన్న ఆడిట్ పేరాలను త్వరితగతిన క్లియర్ చేసేందుకుగాను కమిటీ సమావేశాలను తరచుగా నిర్వహించాలని అనుకుంటున్నాను. అకౌంటెంట్ జనరల్ 2.2.2. సమావేశాలకు హాజరు కావడమేకాకుండా,, కమిటీ పరిశీలించవలసిన ముఖ్యమైన అకౌంట్స్కు సంబంధించిన అంశాలను ఎత్తిచూపడం ద్వారా కమిటీకి సహాయ సహకారాలను అందించవలసిందిగా కోరుతున్నాను. రాష్ట్రానికి సంబంధించిన నివేదికలను సకాలంలో మరియు ఖచ్చితమైన పద్ధతిన ఖరారు చేయడంలో ఉత్తమ రీతిలో కమిటీకి తోడ్పడవలసిందిగా అకౌంటెంట్ జనరల్ మరియు వారి కార్యాలయాధికారులను కోరడమవుతున్నది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు మరియు శాఖాధిపతులు తమ తమ శాఖలకు సంబంధించిన అకౌంట్స్ ఆడిట్ రిపోర్టులను పరిశీలించినప్పుడల్లా సమావేశాలకు హాజరు అయ్యి ఆడిట్ పేరాల చర్చల్లో పాల్గొని వాటి పరిష్కారానికి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. సెప్టెంబర్ 30, 2024 నాటికి కాగ్ నివేదికలలోని విభాగాల వారీగా ఆడిట్ పేరాలపై పి.ఏ.సి. కమిటీకి అందజేసిన సమాచారం ప్రకారం 32 విభాగాలకు సంబంధించి 549 ఆడిట్ పేరాలు తెలంగాణకు సంబంధించి, 490 ఉమ్మడి ఆంధ్రప్రదేశికి సంబంధించి పెండింగులో ఉన్నాయి. శాఖలవారీగా తీసుకున్న చర్యలపై కాగ్ నివేదిక ప్రకారం 30వ సెప్టెంబర్, 2024 నాటికి 271 యాక్షన్ టేకెన్ నోట్సు చర్చించవలసి ఉంది. వీటిలో 41 ప్రత్యేకంగా తెలంగాణకు సంబంధించినవి కాగా, 230 ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు సంయుక్తంగా సంబంధించినవి ఉన్నాయి. ప్రస్తుతం పి.ఏ.సి. సమావేశంలో చర్చించవలసిన ఆడిట్ పేరాలు మరియు సిఫారసుల యొక్క వివరాలు సభ్యులకు అందజేయడం జరిగింది. వీటిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 41 సిఫారసులు, 549 ఆడిట్ పేరాలుండగా, కొన్నింటికి వివరణాత్మక సమాధానాలు యాక్షన్ టేకెన్ నోట్స్ వచ్చినప్పటికీ, చాలావరకు ఇంకా రావలసి ఉంది. ఇప్పుడున్న కాగ్ నివేదికలు మరియు ఆడిట్ పేరాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులు మరింత శ్రద్ధ చూపాలని కోరుచున్నాను. ఎంతో కాలంగా పెండింగులో ఉన్న ఆడిట్ పేరాలను క్లియర్ చేయడంలో శ్రద్ధ చూపేలా తమ ఆధ్వర్యంలోని శాఖాధిపతులకు తగిన ఆదేశాలివ్వాలని చీఫ్ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ముఖ్య కార్యదర్శులు మరియు సంబంధిత కార్యదర్శులను నేను కోరుతున్నాను. ఈ విషయంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో కలిసి పనిచేస్తే, సదరు రిపోర్టులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి కమిటీ తన నివేదికలను ఉభయ సభలకు సకాలంలో సమర్పించే అవకాశం ఉంటుంది. నేను చైర్మన్ గా ఉండే ఈ పదవీ కాలంలో అనుభవజ్ఞులైన సభ్యులు ఉన్నతాధికారుల దిశానిర్దేశంతో కమిటీ పనితీరులో మార్పు తీసుకువచ్చి, సకాలంలో నివేదికలను సమర్పించగలమని ఆశిస్తూ, ఈ సమావేశానికి విచ్చేసిన మీకందరికీ మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని పి ఎస్ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. కమిటీ యొక్క ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఆమె అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి పేర్కొన్నారు. ముఖ్య కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కార్యదర్శులు తదితరులు నిర్ణీత సమయంలోగా వివరణాత్మక నోట్స్, యాక్షన్ టేకెన్ నోట్‌లను అందజేయాలని మరియు కమిటీకి నివేదికలను సకాలంలో అందించడంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తామని ఆమె హామీ ఇచ్చారు. స్పెషల్ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక కమిటీ ఒక మాదిరిగా ఉందని నొక్కిచెప్పారు. మినియేచర్ లెజిస్లేచర్‌ని పరిశీలిస్తుంది వివిధ వాటికి బడ్జెట్ కేటాయింపులు డిపార్ట్‌మెంట్లు వాటిపై చేసిన ఖర్చుల ప్రకారం అలా చేసిన కేటాయింపులకు అనుగుణంగా, వాటిని కేటాయించిన మరియు సెట్ చేసిన ప్రయోజనాల కోసం విచలనాలు, ఏదైనా ఉంటే, దాని నివేదికలో శాసనమండలి ఉభయ సభలు సూచిస్తున్నాయి దానిపై పరిష్కార చర్యలు. అతని ప్రకారం, ది కమిటీ చెక్స్ %ఐ% బ్యాలెన్స్ సిస్టమ్‌గా పనిచేస్తుంది ప్రభుత్వ బడ్జెట్ వ్యయంపై. బడ్జెట్ వ్యయం కోసం నోడల్ ఏజెన్సీగా, తన శాఖను పొడిగిస్తానని హామీ ఇచ్చారు. కమిటీకి పూర్తి సహకారం. కూనంనేని సాంబశివరావు, చిక్కుడు వంశీ కృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, భాను ప్రసాద రావు, రామారావు పవార్, చర్చకు ఉద్దేశించిన ఆడిట్ పారాస్‌పై వివరణాత్మక నోట్స్ లేదా యాక్షన్ టేక్ నోట్స్ సమావేశానికి రావడానికి సభ్యులకు ముందుగానే. అందుబాటులో ఉంచాలని వారు అభిప్రాయపడ్డారు. దానిపై సమర్ధవంతమైన చర్చను నిర్వహించడానికి దోహదపడుతుంది అని తెలియచేసారు.

## కాసాని వీరేశం ను కలిసినఆత్మకూరు (ఎం )నేతాజీ యువజన మండలిసభ్యులు.




**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన కాసాని వీరేష్ ముదిరాజును నేతాజీ యువజన మండలి సభ్యులు హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అధ్యక్షులు ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఎన్.వై ఎం ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ క్రీడలకు,క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వీరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.వై ఎం మాజీ అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ గౌడ్, దొంతర బోయిన భాస్కర్, సభ్యులు ఎలగందుల మహేష్, పలారం బండి మధు, మాటూరి గణేష్,యాస సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి ని పరామర్శించినబండి రమేష్



**కూకట్ పల్లి అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ**


కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పరామర్శించారు. పుష్పరెడ్డి కి ఇటీవల అనారోగ్యానికి గురి అయ్యారు మోకాళ్ళకు ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో బండి రమేష్ గారు బాల నగర్ లోని ఆమె నివాసంలో సోమవారం కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో యధావిధిగా చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, దినేష్ కుమార్, శ్రీకాంత్ పటేల్, యుగంధర్ ,అస్లాం, అరుణ్, నయీమ్ ,కిట్టు, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఛాంబర్ ను అభివృద్ధి చేసిన వారికే 2వ సారి పట్టంకట్టిన ఛాంబర్ సభ్యులు.

-వ్యాపారులు చాంబర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా.

-నమ్మకంతో నన్ను గెలిపించిన వారికి సేవకుడిలా పనులు చేస్తా.

-తొర్రూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సరేష్.



**తొర్రూరు అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ**

వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని నమ్మకంతో నన్ను 2వసారి గెలిపించిన వారికి సేవకుడిలా పనులు చేస్తానని తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ లో జరిగిన ఎన్నికలలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా 2వసారి మచ్చ సురేష్ 180 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శిగా 79 ఓట్ల మెజారిటీతో తల్లాడి హిరాధర్, కోశాధికారిగా 86 ఓట్ల మెజారిటీతో మణికంఠ శ్రీను లు గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ రుణపడి ఉంటామని వ్యాపారుల సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా మరియు చాంబర్ ఆఫ్ కామర్స్ ను ఈ రెండు సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని మరో 2 సంవత్సరాల్లో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తానని అన్నారు. మా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన సదస్సు

**అక్టోబర్ 28, ప్రజా స్వేచ్ఛ కేసముద్రం:**

ఈ రోజు కేసముద్రంలోని ఇంటికన్నె గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన సదస్సు మరియు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మహబూబ్ బాద్ డీఈ శ్రీ విజయ్ మరియు ఏ డీ ఈ కన్స్ట్రక్షన్ ఎం. ఐలయ్య విద్యుత్ వినియోగం, ప్రమాదాల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు . ప్రతి రైతు విద్యుత్ మోటార్లకు కేపాసిటర్ లను అమర్చుకోవాలని, మోటార్ లకు ఎర్తింగ్ తప్పనిసరి గా చేయాలని ,ఇండ్లలో ఎర్త్ కనెకషన్ మంచిగా ఉండేట్లు చూసుకోవాలని, సర్వీస్ వైర్లు ఇంటిలోని ఇనుప రేకు షెడ్డుకు దూరం ఉండేట్లు చూసుకోవడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చూడాలని అయన రైతులను కోరారు. ఆటోమెటిక్ స్టాటర్ల వినియోగంతో ట్రాన్స్ఫార్మర్ లపై ఒకేసారి అధిక లోడ్ పడడంతో అవి కాలిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ట్రాన్స్ఫార్మర్ ల వద్ద ఏదైనా సమస్య ఉంటే వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలపాలని,రైతులు సొంతంగా ట్రాన్స్ఫార్మర్ లు, రిపేర్లు చేయరాదని తెలిపారు.అలాగే ప్రభుత్వ 938 రూపాయలకే నూతన విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తున్నారని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డిఈ పెరుమాళ్ళ విజయ్ కోరారు.ఈ కార్యక్రమం లో ఏడిఈ మచ్చ ఐలయ్య, ఏఈ రాజు, లైన్మెన్ ఐలేశ్వర్, జెఎల్ఎం. నరేష్ మరియు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిజినెస్

## గూగుల్‌కు రూ.26వేల కోట్ల జరిమానా

**– చిన్న సంస్థను తొక్కేసిన కేసులో..**



లండన్ : ఒక్క చిన్న సంస్థను తన టెక్నాలజీతో తొక్కేసిన కేసులో దిగ్గజ సెర్చింజన్ గూగుల్‌కు భారీ జరిమానా పడింది. 2006లో బ్రిటన్ చెందిన శివన్, ఆడమ్ రాఫ్ అనే దంపతులు ధరలను పోల్చుకోవడానికి వీలుగా 'ఫౌండమ్' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కాగా.. సెర్చింజన్‌లో కీ వర్డ్ ఉపయోగించి వెతికినప్పటికీ ఫౌండమ్ కనిపించకుండా గూగుల్ కుట్ర చేసిందనేది ప్రధాన అభియోగం. ఈ విషయాన్ని వ్యవస్థాపకులు గూగుల్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. పట్టించుకోలేదు. దీంతో వారు యూరోపియన్ కమిషన్‌కు 2010లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తులో గూగుల్ నిర్లక్ష్యం, అన్యాయం చేసినట్లు తేలింది. దీంతో గూగుల్‌పై 2.4 బిలియన్ పౌండ్స్ (దాదాపు రూ.26వేల కోట్లు) జరిమానా విధిస్తూ 2017లో తీర్పునిచ్చింది. దీనిపై గూగుల్ మళ్లీ అప్పీల్‌కు వెళ్లడంతో ఇటీవల యూరోపియన్ కోర్టు ఆఫ్ జస్టిస్ శివన్, ఆడమ్ రాఫ్‌లకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

## ఒప్పో ఇంటర్నేషనల్ వారంటీ

స్మార్ట్‌ఫోన్ల తయారీదారు ఒప్పో తమ ఉత్పత్తులపై ఇంటర్నేషనల్ వారంటీని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. భారత్‌లో కొనుగోలు చేసిన ఎంపిక చేసిన కొన్ని ఉత్పత్తులపై గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) దేశాల్లోనూ సర్వీసు సేవలను పొందవచ్చని సోమవారం ప్రకటించింది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రేన్, ఒమన్, ఇండియా దేశాల్లోని తమ ఉత్పత్తులను తమ బ్రాండ్ సర్వీసు సెంటర్లలో రిపేర్, వారంటీ, అప్‌గ్రేడ్ సర్వీసు సేవలను పొందవచ్చని పేర్కొంది.

## కీలక మైలురాయి దాటిన టాటా టైగోర్ ఈవీ.. అదేమిటంటే..?!

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. ఎలక్ట్రిక్ హ్యాచ్ బ్యాక్ కారు టాటా టియాగో.ఈటాటా మోటార్స్ ఐదు ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తోంది. టియాగో.ఈవీ తోపాటు టాటా మోటార్స్.. టాటానెక్సాన్ ఈవీ, టాటా టైగోర్ ఈవీ, టాటా పంచ్.ఈవీ, టాటా కర్వ్.ఈవీ కార్లను విక్రయిస్తోంది. టాటా టియాగో.ఈవీ నాలుగు ట్రిమ్స్ ఆప్షన్లలో లభిస్తుంది. ఎక్స్ఈ, ఎక్స్ టీ, ఎక్స్ జడ్ ం, ఎక్స్ జడ్ ంలక్స్ వేరియంట్లలో టాటా టైగోర్.ఈవీ అందుబాటులో ఉంది. ఐదు రంగుల్లో టాటా టియాగో.ఈవీ లభిస్తుంది. టాటా టియాగో.ఈవీ కారు టీల్ బ్లూ, డయ్ టోనా గ్రే, ట్రోపికల్ మిస్ట్, ప్రిస్టిన్ వైట్,మిడ్ నైట్ ప్లమ్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. 19.2కిలోవాట్లు లేదా 24 కిలోవాట్ల




బ్యాటరీ ఆప్షన్లతో టాటా టైగోర్.ఈవీ ఇంజిన్ అనుసంధానమై ఉంటుంది. సింగిల్ చార్జింగ్ తో 315 కి.మీ దూరం ప్రయాణించడం టాటా టైగోర్.ఈవీ కారు స్పెషాల్టీ. ఈ కారు ధర రూ.12.49 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి మొదలై రూ.13.75 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది.వీ కీలక మైలురాయిని దాటేసింది. భారత్ మార్కెట్లో ఆవిష్కరించినప్పటి నుంచి 50 వేల కార్లు విక్రయించిన మైలురాయిని చేరుకున్నది. టాటా టియాగో.ఈవీ కారును 2022లో భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది టాటా మోటార్స్. దేశంలోనే అతి తక్కువ ధరకు లభిస్తున్న కారుగా టాటా టియాగో.ఈవీ నిలుస్తుంది. దేశంలోనే అతి తక్కువ ధరకు లభిస్తున్న ఎలక్ట్రిక్ హ్యాచ్ బ్యాక్ కార్లలో ఇదొకటి.

## పీఎన్‌బీ లాభాలు అదుర్స్

**– క్యూ2లో 145 శాతం వృద్ధి**

న్యూఢిల్లీ : దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ విత్త సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 145 శాతం వృద్ధితో రూ.4,303 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,756 కోట్ల లాభాలు నమోదు చేసింది. అదే సమయంలో రూ.9,923 కోట్లుగా ఉన్న నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ).. గడిచిన క్యూ2లో 5.99 శాతం పెరిగి రూ.10,517 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.48 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలానికి 4.98 శాతం జీఎన్‌పీఏ చోటు చేసుకుంది. 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో నికర నిరర్థక ఆస్తులు




0.46 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే కాలానికి 1.47 నికర ఎన్‌పీఏలు చోటు చేటు చేసుకున్నాయి.

**వెల్‌స్పన్‌కు రూ.202 కోట్ల లాభాలు**

ప్రముఖ టెక్స్‌టైల్ కంపెనీ వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ 2024–25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రూ.202.4 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,873.09 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.2,509.08 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో రూ.2,873.09 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.2,283 కోట్ల నుంచి రూ.2,655.87 కోట్లకు పెరిగింది.

**ఐఓసీ లాభాలు 98 శాతం పతనం**

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) లాభాలు భారీగా పడిపోయాయి. 2024–25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 98.6 శాతం పతనంతో కేవలం రూ.180 కోట్ల లాభాలు ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఏకంగా రూ.12,967.32 కోట్ల నికర లాభాలు సాధించింది. రిఫైనరీ మార్జిన్లు తగ్గిపోవడం, గ్యాస్ ధరలను ప్రభుత్వం నిర్ణయించడంతో గడిచిన క్యూ2లో ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడిందని ఆ కంపెనీ పేర్కొంది.

## కెప్టెన్ గా రాహుల్ ను వదులుకోవడానికి సిద్ధమైన లక్నో

లక్నో జట్టు అందరూ అనుకున్నట్టుగానే అడుగులు వేస్తోంది. 2025 ఐపీఎల్ సీజన్లో కెప్టెన్ గా రాహుల్ ను వదులుకోవడానికి సిద్ధమైంది. అంతేకాదు అతడి స్థానంలో కొత్త కెప్టెన్ ను నియమించుకోవడానికి కూడా రెడీ అయింది.. మరో మూడు రోజులు మాత్రమే రిటైన్ లిస్ట్ సమర్పించడానికి గడువు ఉంది. దానికంటే ముందే లక్నో జట్టు సంచలన నిర్ణయాలు తీసుకుంది.. ఇద్దరు అనామక ఆటగాళ్లతో పాటు, ముగ్గురు స్టార్ ఆటగాళ్లను జట్టులో ఉంచుకోనుంది. నిబంధనల ప్రకారం ఈనెల చివరి తేదీ లోపు యాజమాన్యాలు తమ రిటైన్ లిస్టును సమర్పించాల్సి ఉంది.. ఒక్కో జట్టు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. అయితే ఇందులో గరిష్టంగా ఐదుగురు క్యాప్డ్ ఆటగాళ్లు , ఇద్దరు అన్ క్యాప్డ్ ఆటగాళ్లకు అవకాశం ఉంది. ఆర్టీఎం కార్డు ద్వారా లేదా బీసీసీ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ధరతో రిటైన్ చేసుకోవడానికి ఫ్రాంచైజీలకు అవకాశం ఉంది. అలా రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు ఫ్రాంచైజీలు వరుసగా 18, 14, 11 కోట్లు ఇవ్వాలి. ఒకవేళ నాలుగో, ఐదో ఆటగాడిని జట్టులోకి తీసుకోవాలి



అనుకుంటే 18, 14 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అనామక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలనుకుంటే నాలుగు కోట్లు చెల్లించాలి. అయితే ఈ నిబంధనల ప్రకారం లక్నో జట్టు ఇద్దరు అనామక ఆటగాళ్లు మోహ్ సిన్ ఖాన్, ఆయుష్ బదోని ని రిటైన్ చేసుకోనుంది. వీరితోపాటు నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్ ని వరుసగా 18, 14, 11 కోట్ల చెల్లించి తీసుకోనుంది. నికోలస్ పూరన్ కు జట్టు సారధ్య బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించుకుంది. మార్కస్ స్టోయినిస్ ను రైట్ టు మ్యాచ్ కార్డు ద్వారా అంటిపెట్టుకోనుంది. కొంతకాలంగా పూరన్ టి20లలో అద్భుతంగా ఆడుతున్నాడు. ఏకంగా గేల్ రికార్డులను కూడా బద్దలు కొడుతున్నాడు. బ్యాటర్ గానే కాదు, వికెట్ కీపర్ గానూ పూరన్ సత్తా చాటుతాడు. అందువల్లే రిటైన్ జాబితాలో ఫస్ట్ ప్రయారిటీగా పూరన్ ను లక్నో జట్టు ఎంచుకుందని తెలుస్తోంది. అయితే జట్టు కెప్టెన్సీ నుంచి బయటికి వెళ్లిపోవడం అనివార్యం కావడంతో.. రాహుల్ వేలంలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ అతడు కనుక వేలంలోకి వస్తే దక్కించుకోవాలని.. కెప్టెన్ గా నియమించాలని బెంగళూరు జట్టు భావిస్తోంది. ఎందుకంటే ఈసారి డూ ప్లె సిస్ కు ఉద్వాసన పలకాలని బెంగళూరు యాజమాన్యం నిర్ణయించుకుంది. అందువల్లే అతని స్థానాన్ని రాహుల్ తో భర్తీ చేయాలని భావిస్తోంది. డూ ప్లెసిస్ గత సీజన్లో అంతగా రాణించలేకపోయాడు. పైగా అతడికి వయసు కూడా ఎక్కువ కావడంతో చురుకుగా ఆడలేక పోతున్నాడు. దీంతో అతడిని బయటికి పంపించి.. రాహుల్ ను కెప్టెన్ చేయాలని బెంగళూరు యాజమాన్యం నిర్ణయించుకుంది.

## అదే నా చిన్నప్పటి కల: నితీశ్ రెడ్డి

ఆస్ట్రేలియాపై ఆడాలనేది తన చిన్నప్పటి కల అని తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి తెలిపాడు. ప్రతి క్రికెటర్‌కు దేశం తరఫున టెస్టు క్రికెట్ ఆడటం గౌరవంగా భావిస్తాడని, తనకు ఇప్పుడు అలాంటి అవకాశం రానుండటం ఆనందంగా ఉందన్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ నాయకత్వంలో ఎస్ఆర్‌హెచ్‌లో ఆడానని, ఇప్పుడు అతడికి వ్యతిరేకంగా బరిలోకి దిగాల్సి ఉంటుందని నితీశ్ చెప్పాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌కు నితీశ్ ఎంపికైన సంగతి తెలిసిందే. పేస్ ఆల్‌రౌండర్ లోటును నితీశ్‌తో బీసీసీఐ భర్తీ చేసింది. తాజాగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నితీశ్ కుమార్ రెడ్డి మాట్లాడాడు. 'ప్రతి క్రికెటర్‌కు దేశం తరఫున టెస్టు క్రికెట్ ఆడటంను గౌరవంగా భావిస్తాడు. నాకు అలాంటి అవకాశం రానుండటం చాలా ఆనందంగా ఉంది. 2024లో నాకు ప్రతిదీ




మంచే జరుగుతోంది. ఆ దేవుడికి కృతజ్ఞతలు. తప్పకుండా మంచి ఆల్‌రౌండర్‌గా రాణిస్తాననే నమ్మకం ఉంది. ఆస్ట్రేలియా జట్టుతో ఆడటం ఎప్పుడూ సవాలే. నాకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉంది. చిన్నప్పటి నుంచి ఆసీస్‌పై ఆడాలనే కల ఉంది. ఇప్పుడు అది నెరవేరుతుందనుకుంటున్నా. ఇప్పుడు ఇండియా–%ూ% మ్యాచ్‌పైనే దృష్టి పెట్టా. ఐపీఎల్ ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ నాయకత్వంలో ఎస్ఆర్‌హెచ్‌లో ఆడాను. ఇప్పుడు అతడికి వ్యతిరేకంగా ఆడాల్సి ఉంటుంది' అని నితీశ్ చెప్పాడు. ఐపీఎల్ 2024లో ఎస్ఆర్‌హెచ్ తరఫున నితీశ్ రెడ్డి సత్తాచాటాడు. 303 పరుగులు చేసి.. 3 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ ప్రదర్శనతో భారత జట్టులో చోటు సంపాదించాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పుడు బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లే భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇప్పటివరకూ 21 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన నితీశ్.. 708 పరుగులు, 55 వికెట్లు తీశాడు. ఆస్ట్రేలియా సిరీస్‌కు భారత జట్టు: రోహిత్, బుమ్రా, జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుభ్‌మన్, కోహ్లీ, రాహుల్, పంత్, సర్ఫరాజ్, జురెల్, అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ రాణా, నితీశ్, సుందర్.

## స్పోర్ట్స్

## ఎందుకు రుతురాజ్ గైక్వాడ్ కెరీర్‌తో ఆడుకుంటున్నారు

**టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్**




ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌కు చోటు దక్కలేదు. దాంతో సోషల్ మీడియాలో బీసీసీఐ సెలక్షన్ కమిటీపై ట్రోల్స్ వచ్చాయి. రుతురాజ్ యెల్లో జెర్సీ (చెన్నై సూపర్ కింగ్స్ జెర్సీ) వేసుకోవడం వల్లే ఎంపిక చేయలేదని కామెంట్లు చేశారు. రుతురాజ్‌ను సెలక్ట్ చేయకపోవడంపై టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా–ఏతో మ్యాచ్‌లకు జట్టును నడిపించే రుతురాజ్.. ప్రధాన టీమ్‌లో చోటు దక్కించుకోలేకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నాడు. భారీగా పరుగులు చేసినా అవకాశం రాకపోతే ఇంకేం చేయాలి? అని ప్రశ్నించాడు. కృష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ%ౌ% 'భారత క్రికెట్‌లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. మయాంక్ యాదవ్ నెట్స్‌లో కొన్ని ఓవర్ల పాటు బౌలింగ్ వేస్తున్నాడని చెప్పారు. చివరకు శివమ్ దూబె, రియాన్ పరాగ్ మాదిరిగా ఫిట్‌గా లేదని ప్రకటించారు. రుతురాజ్ గైక్వాడ్ విషయంలో ఏం చేస్తున్నారో మీకైనా తెలుసా?. అతడికి కూడా ఎందుకు ఎంపిక కావడం లేదో తెలియదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సెంచరీలు చేసినా టెస్టుల్లో అవకాశం రాలేదు. భారీగా పరుగులు చేసినా అవకాశం రాకపోతే ఇంకేం చేయాలి?' అని ప్రశ్నించాడు.'దేశవాళీ క్రికెట్‌లో సెంచరీలు చేసిన అభిమన్యు ఈశ్వరన్‌ను తీసుకోవడం మంచి నిర్ణయం. కానీ రుతురాజ్ గైక్వాడ్‌ను పక్కన పెట్టడంలో లాజిక్ ఏంటో సెలెక్టర్లు చెప్పాలి. ఎందుకు అతడి కెరీర్‌తో ఆడుకుంటున్నారు?. రుతురాజ్ నుంచి ఇంకేం ఆశిస్తున్నారో చెప్పాలి. మీ ప్రణాళిక ఏంటి?.. ప్రత్యర్థిపై రోజంతా హిట్టింగ్ చేయగల సత్తా ఉన్న బ్యాటర్. కానీ అంతర్జాతీయ క్రికెట్‌కు వచ్చేసరికి మీరు పక్కన పెట్టేస్తున్నారు. రుతురాజ్‌కు కేవలం రెస్టాఫ్ ఇండియా లేదా ఇండియా–ఏ తరఫున మాత్రమే అవకాశం ఇస్తారు. ఇంకెన్నాళ్లు వెయిట్ చేయిస్తారు' అని శ్రీకాంత్ అన్నాడు.

# శ్రీరామ్ నగర్ లో హాస్టల్స్ ను నిషేధించాలని కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 ప్రజా స్వేచ్ఛ

శేరిలింగంపల్లి నియోజకవర్గం లో గల కొండాపూర్ డివిజన్ లోని శ్రీరాం నగర్ ఏ బ్లాక్ కాలనిలో హాస్టల్స్ ఏర్పాటు ను నిరసిస్తూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోజు కాలనిలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ కమర్షియల్ హాస్టల్స్ ఏర్పాటు వల్ల కాలనిలో నివాసం ఉండే సాధారణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు తాగడానికి నీరు సరిపోవడం లేదని, డ్రైనేజి సమస్య ఏర్పడుతుందని అన్నారు. హాస్టల్స్ లో ఉండే వారు రాత్రుల్లో తాగి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, గొడవలు, దొంగ తనాలు జరుగుతున్నాయని, మత్తు పదార్థాలకు అలవాటు పాడి కాలనిలో న్యూసేన్స్ సృష్టిస్తున్నారని, జీ. హెచ్. ఎం. సి, పోలీసులకు




పిర్యాదులు కూడా చేశామని అన్నారు. ట్రాఫిక సమస్య తో పాటు పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడం తో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. హాస్టల్స్ ఏర్పాటు కు కాలనీ వాసులు తమ ఇండ్లను హాస్టల్స్ కు ఇవ్వొద్దని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి సి బ్లాక్ అసోసియేషన్ సభ్యులు కూడా పూర్తి మద్దతు నిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్స్ వద్దు, రెసిడెన్సీయల్ ముద్దు అని స్లొగన్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ లక్ష్మి, వాణి, వరాలు, శ్రీదేవి, లక్ష్మి, మాదవి, కవిత, శ్రీదేవి, దేవిక, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి రాము, ప్రసాద్ రావు, శ్రీనివాస్, మల్లేష్, రమణ, చంద్రమౌళి, తిరుపతి, నర్సింహా రెడ్డి, రవి, భాస్కర్ రావు, అవుదేశ్ నారాయణ, బంగారెడ్డి, పాత్రుడు, ఈశ్వరయ్య, పుల్లయ్య, కృష్ణ మూర్తి, సంజీవ రెడ్డి, మల్లయ్య, నాగేశ్వర్ రావు, మూర్తి, మహేందర్ సింగ్, ఉన్ని, రఫీ, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మణి గళ్ళ గుట్టకు మైనింగ్ నిలుపుదల చేయాలని డిమాండ్

-కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో

వలిగొండ అక్టోబర్ 28 ప్రజా స్వేచ్ఛ

యాదాద్రి మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామస్తులు సర్వే నెంబర్ 580లో మణి గళ్ళ గుట్ట కు భార్గవ మినరల్ వారు మైనింగ్ కొరకు అప్లై చేసినారు మైనింగ్ను రెడ్ల రేపాక చుట్టుపక్కల గ్రామస్తులు ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ మరియు ఇతర అధికారుల సమక్షంలో వ్యతిరేకించి ఏకపక్షంగా మైనింగ్ రద్దు చేయాలని అందరి సమక్షంలో తెలిపారు మణిగల్ల గుట్ట రెడ్లరేపాక గ్రామంతో పాటు చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు జీవనాధారం పశువుల గొర్రెలు మరియు ఇతర పశు



పక్షాదులకు ద్రాసాని ఆహారాన్ని అందిస్తుంది వర్షాకాలంలో ఆ గుట్ట నుండి వచ్చిన వర్షపు నీటి ద్వారా మా గ్రామ చెరువు నిండుతుంది ఆ చెరువు నింపడానికి ఆ గుట్ట నుండి వచ్చే నీళ్లే ఆధారం తమరు మా గ్రామం ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మానవత దృక్పథంతో ఈ యొక్క మైనింగ్ను దృష్టిలో పెట్టుకొని ఆపివేయాలని మనస్ఫూర్తిగా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో రెడ్ల రేపాక గ్రామ ప్రజలు యూత్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నర్సిరెడ్డి గారిని MLC గారిని మరొకసారి గెలిపించుకుందాం

- యు టి ఎఫ్

ప్రజా స్వేచ్ఛ మరిగూడ అక్టోబర్ 28

వరంగల్ -ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఘట్టుప్పల, అంతంపేట ,వెల్మకన్నె, యు పి ఎస్ తెరట్ పల్లి పాఠశాలలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యు టి ఎఫ్ మండల అధ్యక్షులు దాచేపల్లి రామకృష్ణ, గట్టుప్పల మండల విద్యాధికారి శ్రీమతి జె.అమృతాదేవి గారితో కలిసి ఎమ్మెల్సీ టేబుల్ పోస్టర్లు కరపత్రం లను ఆవిష్కరించారు . సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ ఘట్టుప్పల మండల అధ్యక్షులు దాచేపల్లి రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గారు ఉపాధ్యాయుల సమస్యల కొరకు నిరంతరం పనిచేస్తూ, శాసన మండలిలో పారిశుద్ధ్య కార్మికుల సమస్య తో పాటు వివిధ సమస్యలను ప్రస్తావించి పరిష్కరించడం జరిగింది అని అన్నారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుటలో తోడ్పాటు



అందించి వివిధ కేటగిరిలలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల పరిష్కారానికి తన వంతు కృషి చేయడం జరిగిందని మొదటి ప్రాధాన్యత ఓటు నర్సిరెడ్డి గారికి వేసి గెలిపించాలని, ఉపాధ్యాయులను కోరారు. మండల విద్యాధికారి అమృతాదేవి గారు మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా ఓటరు నమోదు కార్యక్రమంను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బూరుగు వెంకటేశ్వర్లు , కోశాధికారి ఎం.లింగయ్య, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసచార్యులు, కే. లింగస్వామి, మంజులత,సునీత, జ్యోతిబాల, సుజాత, పి.రాణి, జి .శ్రావణి, అంతంపేట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతిజయప్రద గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గట్టుప్పల ,వేల్మకన్నె పాఠశాలలలో చేరిన నూతనఉపాధ్యాయులు సిహెచ్ .సరిత, సిహెచ్ . రాము, జి.స్వప్న లకు యు టి ఎఫ్ సభ్యత్వం అందజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

-ప్రజావాణికి 31ఫిర్యాదులు

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్.

జగిత్యాల రూరల్, ప్రజా స్వేచ్ఛ

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డితో కలసి కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల



పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 31 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ లు మధు సుధన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై తమకు అవగాహన ఉంది.

-పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జనార్ధన్



జగిత్యాల టౌన్, ప్రజా స్వేచ్ఛ

విద్యారంగ సమస్యలపై తమకు అవగాహన ఉందని సమాజంలో విద్యా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఎంతగానో ఉందని రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బడుగు బలహీన వర్గానికి చెందిన అభ్యర్థి న్యాంతాబాద్ జనార్ధన్ అన్నారు. సోమవారం జగిత్యాలలోని శివాజీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలే గాని నేటి ప్రభుత్వలే గాని విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదని గత మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్మెంట్ చెల్లించలేక రోడ్డుపై బైఠాయించవలసిన పరిస్థితి నెలకొందని తెలిపారు. తమను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుగా నిలుస్తానని ఆయన అభిప్రాయ వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుక లేకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అతను ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి గురైనటువంటి వర్గానికి తోడ్పాటు అందించి వారి అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలుస్తున్నానని పేద ప్రజల సంక్షేమం కోసం నిరుద్యోగుల కోసం నిరంతరం అహర్నిశలుగా శ్రమిస్తానని జనార్ధన్ అభిప్రాయ వ్యక్తం చేశారు. నేటి సమాజంలో పట్టభద్రులు కీలకంగా వ్యవహరిస్తున్నారని నిర్ణయాత్మకమైన పాత్రలలో నిలుస్తూ ప్రభుత్వాన్ని ఆలోచింప చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటు నమోదుకు 9505061212 9505025257 నెంబర్లకు సంప్రదించాలని కోరారు .

# పెండింగ్ డిఏ లు ,పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి:తపస్



జగిత్యాల ప్రతినిధి, ప్రజా స్వేచ్ఛ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఏ లను ( కరువు భత్యం) ఈ కుబీర్ లో నెలల తరబడి పెండింగులో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్ ) రాష్ట్ర సహాధ్యక్షులు అయిల్నేని నరేందర్ రావు, జిల్లా అధ్యక్షులు బోనగిరి దేవయ్యలు డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జగిత్యాల పట్టణ మండల శాఖల ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి, జగిత్యాల అర్బన్ మండల తహసిల్దార్ రామ్మోహన్, రూరల్ డిప్యూటీ తాసిల్దార్ కార్తీక్ రెడ్డిల ద్వారా వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులు విడుదల కాకపోవడంతో అత్యవసరాలకు ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులు అందడం లేదని వాపోయారు. వెంటనే విడుదల చేయడంతో పాటు పిఆర్సి కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తపస్ జగిత్యాల పట్టణ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేందర్..రామకృష్ణ ..రాజేశ్వర్.. రమేష్. మహిపాల్ రెడ్డి.. జి. వి. రామకృష్ణ రాజశేఖర్ శర్మ. దేవరకొండ శ్రీనివాస్.. తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నేరేడుచర్ల ప్రజా స్వేచ్ఛ

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ వ్యక్తి పట్టుబడిన సంఘటన నేరేడుచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 28 వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో నేరేడుచర్ల పట్టణం రామాపురం రోడ్డు నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా నేరేడుచర్ల, శివాజీ నగర్ కు చెందిన ఇంజమూరి సురేష్ తన ఆటోలో, ప్రభుత్వం పంపిణీ చేసిన పిడిఎస్ బియ్యాన్ని తన ఇంట్లో గల పిండి మిల్లు ద్వారా నూకలుగా మార్చి వాటిని అనంతారం వద్ద గల కోళ్ల ఫారం లో అమ్మటానికి తీసుకుని వెళు తుండగా,పట్టుబడి చేసి 16 బస్తాల్లో గల 8 క్వింటాళ్ల నూకలుగా మార్చిన పిడిఎస్ బియ్యాన్ని, ఏపీ 24 x 3382 నెంబర్ గల ఆటోను స్వాధీనం చేసుకొని ఇంజమూరి సురేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492